సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా

- అర్హులైన ప్రతిఒక్కరికీ ఆహార భద్రత కార్డులు
- ఈనెల 20లోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- గుమ్మడిదల మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన
- బొంతపల్లి అర్బన్ పార్కు పరిశీలన

గుమ్మడిదల మండలం నల్లవల్లిలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు

గుమ్మడిదల, జనవరి 18: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత (రేషన్)కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా అధికారులు క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను కలెక్టర్ వల్లూరు క్రాంతి శనివారం పరిశీలించారు. గుమ్మడిదల మండలం నల్లవల్లిలో సర్వే బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న తీరును తనిఖీ చేశారు. వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం అర్హులను గుర్తించేందుకు అవలంబిస్తున్న విధానాలను, సర్వే బృందాలు ఇంటింటికి తిరుగుతూ సేకరిస్తున్న వివరాలను కలెక్టర్ పరిశీలించారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా సేకరించిన వివరాలను రిజిస్టర్‌లలో స్పష్టం గా నమోదు చేయాలని కలెక్టర్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. త్వరితగతిన ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఫీల్డ్ వెరిఫికేషన్ కొనసాగుతోందని తెలిపారు. ముఖ్యంగా రైతు భరోసా పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకూ లబ్ధి చేకూర్చేందుకు వీలుగా సాగుకు యోగ్యమైన భూములను సర్వే నెంబర్ల వారీ గా క్షేత్ర స్థాయి పరిశీలన ద్వారా నిర్ధారిస్తామని చెప్పారు. ఆహార భద్రతా కార్డులను అర్హత కలిగిన కుటుంబాలకు అం దించేందుకు వీలుగా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికార బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్నాయని తెలిపారు. ఈనెల 20వ తేదీ నాటికి ఆయా పథకాల కింద అర్హులైన వారి జాబితాను రూపొందించి, 21 నుంచి 24వ తేదీ వరకు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో నిర్వహించనున్న గ్రామ సభల్లో వాటిని ప్రవేశ పెట్టి చదివి వినిపిస్తామన్నారు. గ్రామసభ ఆమోదం మేర కు లబ్ధిదారుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేస్తా మన్నారు. ఈనెల 26వ తేదీన ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత(రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు శ్రీకారం చుట్టి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చనుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం బొంతపల్లి అర్బన్ పార్కును కలెక్టర్, రెవెన్యూ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటవీని, హరితహారం కింద నాటిన మొక్కలను పరిరక్షించాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. వన్యప్రాణులను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కలెక్టర్‌తోపాటు రెవెన్యూ డివిజన్ అధికారి రవీందర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఖిలేష్‌రెడ్డి, తహసీల్దార్ గంగాభవాని, ఎంపీడీవో ఉమాదేవి, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, డీటీ కరుణాకర్ రావు, ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, సర్వే అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సజావుగా నవోదయ పరీక్ష

జహీరాబాద్, జనవరి 18: ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా జరిగింది. జహీరాబాద్ పట్టణంలోని ఆర్ఎల్ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 365 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 252 మంది విద్యార్థులు హాజరైయ్యారని మండల విద్యాధికారి బస్వరాజ్ తెలిపారు. 113 మంది విద్యార్థులు హాజరుకాలేదన్నారు.

సజావుగా పరీక్ష

అందోల్, జనవరి 18: నవోదయ ప్రవేశ పరీక్ష సజావుగా జరిగిందని మండల విద్యాధికారి కృష్ణ తెలిపారు. జోగిపేట లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డాన్ బాస్కో పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏ ర్పాటు చేయగా మొత్తం 173 మంది విద్యార్థులు పరీక్ష రాయగా..169 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలలో 72 మంది, డాన్‌బాస్కోలో 97 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

సిద్ధి వినాయకుడికి పూజలు చేస్తున్న తోగుట పీఠాధిపతి స్వామీజీ

సిద్ధి వినాయక ఆలయంలో మాధవానంద సరస్వతి పూజలు

జహీరాబాద్, జనవరి 18:న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయక ఆలయాన్ని శనివారం తోగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి మహరాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పుజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఈనెల 19 నుంచి 22 వరకు జరగనున్న మహారుద్రం, శ్రీసూక్త పారాయణం, లక్ష మోదక హవనం తదితర పూజా కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు, పుజారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నారాయణఖేడ్, జనవరి 18: నారాయణ ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 3,4,9 వార్డుల్లో రూ.50 లక్షల టీయూఐఎఫ్‌డీసీ నిధులతో నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణఖేడ్ పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

నిజాంపేట్, జనవరి 18: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ మండల పరిధిలోని దామరచెరు గ్రామానికి చెందిన పోగుల విట్టయ్యకు అత్యవసర ఆరోగ్య చికిత్స కోసం రెండు లక్షల విలువ గల ఎల్‌వోసీ చెక్కును అందజేశారు కార్యక్రమంలో భోజిరెడ్డి, జంబికుంట మాడీ సర్పంచ్ రాఘవరెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న జహీరాబాద్ ఆర్డీవో రాందాస్

అర్హులను గుర్తించాలి

రాయికోడ్, జనవరి 18: ప్రభుత్వ పథకాల కోసం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని జహీరాబాద్ ఆర్డీవో రాందాస్ అన్నారు. శనివారం మండలపరిధిలోని ధర్మాపూర్‌లో సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఉప తహసీల్దార్ విజయకుమార్, ఏవో సారిక, సర్వే అధికారి సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యాదర్శి ఖాదిర్ ఉన్నారు.

మహేశ్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

జిన్నారం(బొల్లారం) జనవరి 18: జిన్నారం పంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు, ఆత్మకమిటీ డైరెక్టర్ దుబ్బాక మహేశ్ కుటుంబసభ్యులను బీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల మహేశ్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని పరామర్శించారు. కార్యక్రమంలో వెంకటేశం గౌడ్, భోజిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్ గౌడ్, రమేశ్, శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

రాయికోడ్ ఆదర్శ పాఠశాలలో విద్యర్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆదర్శ పాఠశాలల డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

రాష్ట్ర ఆదర్శ పాఠశాలల డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

రాయికోడ్, జనవరి 18:విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఆదర్శ పాఠశాలల డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం రాయికోడ్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్, సిబ్బంది, విద్యార్థులతో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో 194 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిలో 20వేల మంది 10 తరగతి, 62 వేల మంది ఇంటర్ చదువుతున్నారన్నారు. త్వరలో వీరికి వార్షిక పరీక్షల దృష్ట్యా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. పాఠశాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ పనితీరును అభినందించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

జహీరాబాద్, జనవరి 18: పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో సీఐటీయూ నాయకులతో కలిసి పర్యటించారు. మండల పారిశుధ్య కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పారిశుధ్య కార్మికులు చాలీచాలని వేతనాలను కూడా సకాలంలో చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామ పంచాయతీలకు అరకొరగా విడుదల చేస్తున్న నిధులను సంబంధిత అధికారులు ఇతర పనులకు వినియోగించుకుంటున్నారన్నారు. ఐదు నెలలకు సంబంధించిన వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్, పంచాయతీ పారిశుధ్య కార్మికుల సంఘం డివిజన్ అధ్యక్షుడు సత్తయ్య, మండల పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు కిష్టన్న, నాయకులు ఆనంద్, రామస్వామి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



న్యాల్‌కల్‌లో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

డయాగ్నొస్టిక్ సెంటర్, ప్రైవేట్ క్లినిక్ సీజ్

- నిబంధనలు పాటించకుంటే చర్యలు
- జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి

హత్నూర, జనవరి18: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న డయాగ్నొస్టిక్ సెంటర్‌తోపాటు ప్రైవేట్ క్లినిక్‌ను శనివారం జిల్లా వైద్యాధికారిని గాయత్రిదేవి సీజ్ చేశారు. మండలకేంద్రమైన హత్నూరలో విజయ డయాగ్నొస్టిక్ సెంటర్‌తోపాటు జైభవాని ప్రైవేట్ క్లినిక్‌ను పరిశీలించిన ఆమె ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తుండటంతో సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విజయ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు ప్రభుత్వం నుంచి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశామని చెప్పారు. అంతేకాకుండా జై భవాని ప్రైవేట్ క్లినిక్‌లో నిబంధనలకు విరుద్ధంగా నాలుగు బెడ్లు ఏర్పాటు చేసి వైద్యం చేస్తుండటంతో సీజ్ చేశామన్నారు. క్లినిక్‌పై గతంలో సైతం చర్యలు తీసుకున్న ప్పటికి మళ్లీ నిబంధనలు పాటించకపోవడంతో ఆగ్ర హం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాని ఆమె హెచ్చరించారు. గుర్తింపు వున్న డయాగ్నొస్టిక్ సెంటర్లలో మాత్రమే ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం హత్నూర ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. దవాఖానలో ప్రసవాల సంఖ్యను పెంచాలని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. దవాఖాన పరిసరాలను శుభ్రంగా వుంచాలన్నారు. దవాఖానలో అవసర మగు మందులు, ఇతరత్రా సామగ్రి మంజూరుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆమె వెంట అధికారులు ఉన్నారు.

హత్నూరలో జై భవాని ప్రైవేట్ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి

హత్నూరలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న విజయ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను సీజ్‌చేసిన వైద్యాధికారి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

దౌల్తాబాద్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ సుభాష్

హత్నూర, జనవరి 18: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హత్నూర ఎస్ఐ సుభాష్ తెలిపారు. శనివారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వాహనాల పూర్తి పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. లైసెన్స్ ఉన్నవారే వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాతోపాటు జైలుశిక్ష పడే అవకాశం ఉందని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండులపై కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ దుర్గయ్య ఉన్నారు.

రేషన్‌కార్డుల వివరాలు సరిగా నమోదు చేయాలి

అందోల్, జనవరి 18: రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి పూర్తి వివరాలను సరిగా నమోదు చేసుకుని ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని అన్నాసాగర్, పోసానీపేట్ గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులను అందిస్తుందని, అందులో భాగంగా వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. అన్ని రకాలుగా అర్హులుగా ఉండి రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోని వారు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో అశోక్, పంచాయతీ కార్యదర్శి హైమద్ తదితరులు పాల్గొన్నారు.

అందోల్: పోసానీపేట్‌లో వివరాలు సేకరిస్తున్న పంచాయతీ అధికారి సాయిబాబా

సంగాపూర్‌లో చిన్నారి మృతిపై సమగ్ర విచారణ

సంగాపూర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

రాయికోడ్, జనవరి 18: ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన వైష్ణవి కేసును సమగ్రంగా విచారిస్తామని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి సంగాపూర్ గ్రామాన్ని సందర్శించారు. అనంతరం చిన్నారి మృతి చెందిన బావిని, ఇంటిని పరిశీలించి గ్రామస్తులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ..గ్రామానికి చెందిన మధుగడ సతీష్ ఎరుకలి అనితను 12 ఏండ్ల క్రితం పెండ్లి చేసుకున్నాడని, వీరికి ఇద్దరు కూతుళ్లు వైష్ణవి(11), హరిత(6) ఉన్నారు. రెండు నెలల క్రితం భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో అనిత ఇంటి నుంచి వెళ్లి పోయింది. నెల క్రితం చిన్న కూతురు హరిత అనారోగ్యంతో చనిపోయింది. రెండో కూతురు వైష్ణవి వారంక్రితం అదృశ్యమైన గురువారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శవమై తెలింది. మృతురాలు నానమ్మ సమ్మమ్మ ఫిర్యాదుతో డీఎస్పీ గ్రామాన్ని, ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ కొనసాగించి, బాలిక మృతికి కారకులను పట్టుకుంటామన్నారు. ఆయన వెంట జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు, ఎస్ఐ నారాయణ తదితరులు ఉన్నారు.

మహిళలు క్యాబ్ డ్రైవర్లుగా రాణించాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

కలెక్టరేట్ జనవరి 18: డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు క్యాబ్ డ్రైవర్లుగా రాణించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ఎస్‌బీఐ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 33 మంది మహిళలకు డ్రైవింగ్‌లో 30 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. శనివారంతో మహిళల డ్రైవింగ్ శిక్షణ పూర్తి కావడంతో పాత డీఆర్‌డీఏ కార్యాలయంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పురుషులతో సమానంగా మహిళలు డ్రైవింగ్ రంగంలో రాణించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న మహిళలు ప్రభుత్వం అందజేసే సబ్సిడీతో వాహనాలు పొందవచ్చని తెలిపారు. హైదరాబాద్ సమీపంలో ఉన్నందున మహిళలు క్యాబ్ డ్రైవర్లుగా మారి ఉపాధి పొందవచ్చని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కలెక్టర్ క్రాంతి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో జయశ్రీ, శిక్షణ కోఆర్డినేటర్ శివశంకర్, ట్రైనర్ రామమూర్తి, నర్సింహులు, రవిశేఖర్ పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళ నడిపిన కారులో కలెక్టర్ తన ఇంటికి వెళ్లారు.

21 నుంచి గ్రామసభలు

ప్రభుత్వం పథకాల అమలు కోసం ఈనెల 21 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో కలెక్టర్ క్రాంతి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రతకార్డుల పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. మూడు పథకాల అమలు కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వే పూర్తి కావస్తుందని తెలిపారు. సర్వే పూర్తి కానున్న నేపథ్యంలో ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతుభరోసా పథకానికి 7,63,049 ఎకరాల భూమిని గుర్తించినట్లు చెప్పారు. ఇందిరమ్మ భరోసా పథకం అమలుకు 25వేల మంది కూలీలను గుర్తించామని, రేషన్‌కార్డు కోసం 26,158 మంది దరఖాస్తు చేసుకోగా 22,792 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, జెడ్పీసీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబా, హౌసింగ్ పీడీ చలపతిరావు, డీఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

రామచంద్రాపురం, జనవరి 18: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలితాసోమిరెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. చైర్‌పర్సన్‌తోపాటు వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు వారి వార్డుల్లో ఉన్న రోడ్లు, డ్రైనేజీలు, శ్మశాన వాటికలు, తాగునీటి సమస్యలను చైర్‌పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎజెండాలో పొందుపర్చిన అంశాలను సభ్యులు సమావేశంలో తీర్మానించారు. వివిధ అభివృద్ధి పనులకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి కేటాయించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతుల సమస్య పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం, జనవరి18: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో రేడియల్ రోడ్డులో భూమిని కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం మెరుగైన నష్టపరిహారం అందించేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఉస్మాన్‌నగర్‌లో హెచ్ఎండీఏ, రైతులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మెరుగైన పరిహారం అందిస్తే భూమిని ఇచ్చేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని రైతులు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఉస్మాన్‌నగర్ నుంచి వట్టినాగులపల్లి వరకు రేడియల్ రోడ్డు అత్యంత కీలకమని, ఉస్మాన్‌నగర్ పరిధిలో కొంతమంది రైతులు భూమిని ఇవ్వకపోవడం మూలంగా రోడ్డు పనులు నిలిచిపోయాయని తెలిపారు. భూమి కోల్పోతున్న ప్రతి రైతుకూ మెరుగైన పరిహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ ముఖ్యప్రణాళిక అధికారి రవీందర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఉమేశ్వర్, శ్యామ్‌రావు, రవీందర్‌రెడ్డి ఉన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

ఆపత్కాలంలో అండగా సీఎంఆర్ఎఫ్

సదాశివపేట, జనవరి 18: పేదలకు ఆపత్కాలంలో అండగా సీఎంఆర్ఎఫ్ నిలుస్తుందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో 32 మంది లబ్ధిదారులకు రూ.10.6 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు చింతా సాయినాథ్, బీఆర్ఎస్ మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దగొల్ల ఆంజనేయులు, ఆరిపొద్దీన్, మాజీ ఎంపీపీ తొంట యాదమ్మ కిష్టయ్య, ఎంపీటీసీలు సత్యనారాయణ, మాధవరెడ్డి, సుధాకర్, అల్లం లలిత, రవికుమార్, మాజీ సర్పంచ్‌లు మునిగె నవీన్, లక్ష్మారెడ్డి, సంగమేశ్వర్, నల్లోలకుమార్, నరేశ్‌గౌడ్, మాణయ్య, రాములు, సల్లావు ద్దీన్, హరీశ్, ప్రసాద్‌గౌడ్, సంగన్న, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజ్, రమేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత..

రామచంద్రాపురం, జనవరి 18: భారతీనగర్ డివిజన్ పరిధిలోని పలువురికి కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. డివిజన్‌లోని ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియాకు చెందిన రామకృష్ణకు రూ.20వేలు, మాధవికి రూ.24వేలు, ఎంఐజీ కాలనీకి చెందిన చందుకు రూ.60వేలు సీఎంఆర్ఎఫ్ మంజూరు కావడంతో కార్పొరేటర్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేయించుకోవడానికి సీఎంఆర్ఎఫ్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో నర్సింహ, జైపాల్ ఉన్నారు.

రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలి

జహీరాబాద్, జనవరి 18: రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ డిపో పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు అధికారులను కోరారు. శనివారం జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హైదరాబాద్‌కు వెళ్లేందుకు బస్సులు లేక అవస్థలు పడుతున్నామన్నారు. డిపో పరిధిలోని జాడీమల్కాపూర్‌కు వెళ్లే బస్సు సమయాన్ని మార్చాలన్నారు. మామిడిపల్లి, ఇందుర్, బూచినెల్లి గ్రామాలకు బస్సు నడించేలా చ